# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

తేది : **22-01-2026** సమయం : **1.20** గంటలు

---

# ముఖ్యాంశాలు

**1.** కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్.

**2.** రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో జరుగనున్న రథసప్తమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి.

**3.** సమన్వయం, సత్వర స్పందనతో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని వెల్లడించిన మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి.

**4.** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర భూసర్వే లోపభూయిష్టంగా ఉందని విమర్శించిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి.

=========================

ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పల్నాడు జిల్లాలో ఈరోజు పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. కోటప్పకొండకు చేరుకున్న ఆయనకు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత కోటప్పకొండ నుంచి కొత్తపాలెం వరకు నిర్మించిన రహదారి ప్రారంభోత్సవంలో ఉపముఖ్యమంత్రి పాల్గొన్నారు.

----------------------

రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో జరుగనున్న రథసప్తమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారిని మంత్రి ఈరోజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలుగకుండా తిరుమల, అరసవల్లి ఆలయాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అరసవల్లిలో జరిగే రథసప్తమి వేడుకల్లో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని మంత్రి తెలుపుతూ,

వాయిస్.. 30 సెకన్లు

----------------------

సమన్వయం, సత్వర స్పందనతో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. మొంథా తుఫాన్ సమయంలో ఎదురైన పరిస్థితులు, వాటిని

ఎదుర్కొన్న విధానంపై ప్రకాశం జిల్లా యంత్రాంగం రూపొందించిన జిల్లా విపత్తుల నిర్వహణ నివేదికను ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో మంత్రి నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విపత్తులను ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు.

వాయిస్..30 సెకన్లు

-----------------------

అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ రాష్ట్రాలను ఆదేశించింది. డిజిటల్ విధానంలో గ్రామ సభల నిర్వహణ, వాటిలో తీసుకున్న నిర్ణయాలను "సభాసార్" పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే విధానంపై కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ తొలిసారి తెలుగులో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు లేఖ రాసింది. సభల్లో తీసుకున్న నిర్ణయాలను కృత్రిమ మేధ-ఏఐ సహాయంతో పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది. దీనివల్ల సిబ్బందిపై పని భారం తగ్గడంతోపాటు సమావేశాల పూర్తి వివరాలు సమగ్రంగా నమోదవుతాయని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి ఆలోక్ ప్రేమ్‌నగర్ లేఖలో పేర్కొన్నారు.

-----------------------

షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు 270 కోట్ల రూపాయల ప్రోత్సాహకాలు అందించినట్లు

సూక్ష్మ, చిన్న మధ్యతరహ పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రెండు దశలలో ఈ ప్రోత్సాహకాలు అందించామని తెలిపారు. దీర్ఘకాలిక పారిశ్రామిక వృద్ధి లక్ష్యాలను సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతగానో దోహదపడుతుందని మంత్రి వివరించారు.

----------------------

దేశానికి కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధిలో జాప్యానికి కారణమయ్యే సమస్యలను పరిష్కరించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న Pro-Active Governance and Timely Implementation- ప్రగతి సమావేశాలు దోహదపడ్డాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. దేశవ్యాప్తంగా అమలవుతున్న జాతీయ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తోంది. ప్రగతి వ్యవస్థలో భాగంగా ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ - PMG పోర్టల్‌లో సుమారు 7,53,690 కోట్ల రూపాయల పెట్టుబడితో రాష్ట్ర పరిధిలోని 210 ప్రాజెక్టులు పర్యవేక్షణలో ఉన్నాయి. వీటిలో జాతీయ రహదారులు, చమురు, సహజ వాయువు, విద్యుత్ ఉత్పత్తి, రైల్వేలు, గనులు , నౌకాశ్రయాలు వంటి రంగాలకు చెందిన పలు ప్రాజెక్టుల గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమీక్ష నిర్వహించారు. భూ సేకరణ, అటవీ పర్యావరణ అనుమతులు, రాష్ట్ర, జిల్లా స్థాయి పాలనా సమన్వయం వంటి అంశాలలో ప్రాజెక్టుల పురోగతికి ప్రగతి సమావేశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

-----------------------

ప్రభుత్వ ప్రోత్సాహకాలతో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ - శాప్ చైర్మన్ ఏ. రవి నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటనపై తిరుపతిలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ, ప్రభుత్వం నూతన సాంకేతికతలకు ప్రాధాన్యమిస్తూ, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం కంప్యూటర్ వంటి విధానాలను తీసుకువచ్చిందన్నారు. అలాగే క్రీడాకారుల ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకువచ్చిందని తెలిపారు.

వాయిస్..26 సెకన్లు

-----------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

-----------------------

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర భూసర్వే లోపభూయిష్టంగా ఉందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. ఎస్. జగన్

మోహన్ రెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో భూసర్వేకు 6 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశామని తెలిపారు. వివాదాలు లేకుండా పాదర్శకంగా ఈ సర్వే నిర్వహించి భూ యజమానులకు శాశ్వత యాజమాన్య పత్రాలు ఇచ్చామని పేర్కొన్నారు.

----------------------

వాహనాలు నడిపేటప్పుడు ప్రతిఒక్కరూ అప్రమత్తతో వుండాలని అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ అన్నారు. 37 వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ ర్యాలీ అనంతపురం మున్సిపల్ కార్యాలయం నుండి క్లాక్ టవర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలన్నారు జిల్లా వ్యాప్తంగా నెల రోజులపాటు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

----------------------

పోలవరం ప్రాజెక్టు గ్యాప్-2 ప్రధాన డ్యాం ఆకృతులతోపాటు వివిధ అంశాలపై నిర్ణయాలు వారంలో వెల్లడిస్తామని విదేశీ నిపుణుల బృందం స్పష్టం చేసింది. మూడు రోజుల పాటు పోలవరంలో పర్యటించిన బృందం నిన్న ప్రాజెక్టు అథారిటీ సభ్య కార్యదర్శి ఎం.రఘురామ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలవరం

ప్రాజెక్టుకు, ఇతర డ్యాంలకు ఉన్న తేడాలను అధికారులు వారికి వివరించారు. గ్యాప్-2 ఆకృతులకు సంబంధించి నివేదికలను పరిశీలించి, భూకంపాలను తట్టుకునేలా చేపట్టాల్సిన నిర్మాణాల ఆకృతులపైనా అధ్యయనం చేసి తుది నిర్ణయాలు వెల్లడిస్తామని నిపుణుల బృందం తెలిపింది.

-----------------------

తిరుమలలో ఈ నెల 25న రథసప్తమి పర్వదినం పురస్కరించుకొని మూడురోజులపాటు సర్వదర్శన టోకెన్ల జారీని నిలిపివేయనున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం - టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతిలోని మూడు టికెట్ కేంద్రాల్లో మరుసటి రోజు దర్శనాలకు జారీ చేసే ఈ టోకెన్లను రేపు, ఎల్లుండి, 25 తేదీల్లో జారీ చేయమని తెలిపింది. తిరిగి 26వ తేదీన మరుసటి రోజు దర్శనానికి సంబంధించిన టోకెన్లను ఇవ్వనున్నామని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆయా టోకెన్ల జారీ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని భక్తులు సహకరించాలని కోరింది.

====================